క్లుప్తంగా

ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలి


కొఠారు అబ్బయ్యచౌదరి, మాజీ ఎమ్మెల్యే

దెందులూరు: ఏలూరు క్రాంతి కళ్యాణమండపంలో మంగళవారం జరగనున్న వైఎస్సార్ సీపీ కుటుంబ ఆత్మీయ సమావేశానికి నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ సమావేశానికి ఉభయ గోదావరి జిల్లాల పార్టీ రీజినల్ కోఆర్డినేటర్, శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ముఖ్య అతిథిగా విచ్చేస్తున్నారన్నారు. అతిథులుగా పార్టీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, ఏలూరు పార్లమెంట్ కోఆర్డినేటర్ కారుమూరి సునీల్ కుమార్, మాజీ ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ తోపాటు జిల్లాలో అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జులు, మాజీ ఎమ్మెల్యేలు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, మాజీ సొసైటీ చైర్మన్లు, మాజీ ఏఎంసీ చైర్మన్ హాజరవుతారన్నారు. నియోజవర్గంలోని ప్రజలు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ సమా వేశాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఘనంగా సీతారాముల రథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

నిడమర్రు: అడవికొలనులో శ్రీరాముని కల్యాణ ఉత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీరాముని రథోత్సవం కోలాహలంగా జరిగింది. సీతమ్మ వారిని శ్రీరాముని భారీ రథంపై ఉంచి రథాన్ని లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. ఈ సందర్భంగా ఇంటి ముందుకు వచ్చిన సీతారాములకు భక్తులు అరటిగెలలు సమర్పించారు. ఈ ఉత్సవాలకు అడవికొలను గ్రామంతో పాటు చుట్టుప్రక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. రథోత్సవంలో పాల్గొన్న వారిలో ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు, జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు తదితరులున్నారు.

సీతారామస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

భీమడోలు: జిల్లాలో ప్రసిద్ధి చెందిన దేవాదాయ ధర్మదాయ శాఖ ఆధీనంలోని సీతారామస్వామి ఆలయంలో శ్రీరామనవమిని పురస్కరించుకుని నిర్వహిస్తున్న వార్షిక కల్యాణోత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. ఆలయ ఫౌండర్ కొండ గంగరాజ్‌కుమార్ పర్యవేక్షణలో నాల్గవ రోజైన సోమవారం రాత్రి అర్చక బృందం సుధీరాచార్యులు, గోపాలాచార్యులు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి.

వాతావరణ మార్పులపై అప్రమత్తంగా ఉండాలి

ఉంగుటూరు: వాతావరణంలో మార్పులకు అనుగుణంగా రైతులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రవికుమార్ సూచించారు. మండలంలోని అధికార్లుతో, వీఆర్వోలతో సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ రవికుమార్ మాట్లాడుతూ అధికార్లు కూడా ఈవిషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆరు బయట ఆరబెట్టిన ధాన్యాన్ని రైతులు జాగ్రత్త చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో టీటీలు పూర్ణచంద్ర ప్రసాద్, పోతురాజు, ఆర్ఐ, విఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

సనాతన ధర్మాన్ని కాపాడిన యోధుడు శివాజీ


మాట్లాడుతున్న కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ

ఉంగుటూరు: భారతీయ సంస్కృతి, సంప్రదాయాలతో పాటు సనాతన ధర్మాన్ని కాపాడిన మహాయోధుడు ఛత్రపతి శివాజీ అని కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. సోమవారం ఉంగుటూరు మండలం ఉప్పాకపాడులో చత్రిపతి శివాజీ సేవాసమితి ఆధ్వర్యంలో నిర్మించిన ఛత్రపతి శివాజీ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు.

యువతకు సహకరించాలి

ఉంగుటూరు: నిరుద్యోగులకు స్వయం ఉపాధి యూనిట్లు నెలకొల్పేందుకు బ్యాంక మేనేజర్లు సహకరించాలని ఉంగుటూరు ఎంపీడీవో రాజ్ మనోజు కోరారు. సోమవారం ఉంగుటూరు యూనియన్ బ్యాంకు, నారాయణపురం, కైకరం స్టేట్ బ్యాంకు మేనేజర్లుతో కలిసి చర్చించారు. ఈమేరకు ఎంపీడీవో మాట్లాడుతూ గత నెల 26, 27 తేదీలలో స్వయం ఉపాధి సోపానం ఇంటర్వ్యూల్లో ఎంపికైన అభ్యర్థుల జాబితాను ఆయా బ్యాంకులకు పంపించడం జరగుతుందని తెలిపారు. ఎంపీడీవో పాటు సీనియర్ సహాయకుడు ఫణి పాల్గొన్నారు.

రోడ్లపై ధాన్యం.. రైతుల్లో భయం భయం

- రోడ్లపైనే ధాన్యాన్ని భద్రపరుస్తున్న రైతులు
- ధాన్యం గోడౌన్లు నిర్మించాలంటున్న అన్నదాతలు


రోడ్లపైనే ధాన్యం ఆరపెడుతున్న రైతులు


ధాన్యం తడవకుండా టార్పాలిన్లు కప్పిన దృశ్యం

దెందులూరు: ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని భద్రపరుచుకునేందుకు కనీసం గోడౌన్ సౌకర్యం లేకపోవడంతో నియోజకవర్గంలోని రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చేతికొచ్చిన పంటను రోడ్డుపై ఆరబెట్టుకునే సమయంలో తుపాన్లు, అకాల వర్షాల ధాటికి తడిసిపోవడంతో ఏటా రైతన్నలకు కన్నీరే మిగులుతోంది. దెందులూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 28 వేల ఎకరాల్లో వరి సాగు రెండు పంటలుగా జరుగుతుంది. జిల్లా కేంద్రానికి నాలుగు వైపులా దెందులూరు నియోజకవర్గం అంటిపెట్టుకుని ఉన్నా ఇక్కడి రైతుల కోసం జిల్లా అధికారులు దృష్టి పెట్టకపోవడంతో రైతులకు అగచాట్లు తప్పడం లేదు. కష్టపడి పండించి పంట దిగుబడి ఆశాజనకంగా వచ్చినా ధాన్యం విక్రయించే వరకు రైతుల గుండెల్లో గుబులు తప్పదు.

కనీసం షెడ్లు కూడా లేవు

ఇక్కడ గోడౌన్ లేకపోవడంతో రైతులు రోడ్డుపైనే ధాన్యాన్ని భద్రపరుచుకునే పరిస్థితి. చేలో నుంచి తీసుకొచ్చిన ధాన్యం భద్రంగా పెట్టుకోవడానికి ఏ ఒక్క గ్రామంలోనూ షెడ్లు లేవు. ప్రతి గ్రామంలో రైతులు రోడ్ల పైన ఖాళీ స్థలాల్లోనూ ధాన్యం ఉంచుతారు. వర్షం వస్తే కప్పటానికి సైతం టార్పాలిన్ కూడా కరువే. అకస్మాత్తుగా వర్షాలు, తుపాను వస్తే తడిసిన ధాన్యాన్ని ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో ప్రతి ఏడాది రైతులు కొట్టుమిట్టాడుతుంటారు. సోమవారం తుపాను హెచ్చరికల నేపథ్యంలో ఇప్పటికే రైతులు రోడ్లపైకి ధాన్యాన్ని చేర్చడంతో ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి రైతులు ధాన్యం సంరక్షణకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

శాశ్వత పరిష్కారం చూపాలి



తుపాన్లు, వర్షాల దాటికి తడిచిన ధాన్యానికి నష్టపరిహారం ఇవ్వడం శాశ్వత పరిష్కారం కాదు. ప్రతి గ్రామంలో ఆహార ఉత్పత్తులు భద్రపరిచేందుకు ఏర్పాటు చేయాలి. ఆరుగాలం శ్రమించిన రైతుకు నష్టం రాకుండా ప్రభుత్వాలు భరోసా కల్పించాలి. టార్పాలిన్లు సైతం అందుబాటులోఉంచాలి.

– డీబీఆర్‌కే చౌదరి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి

గోడౌన్లు ఏర్పాటు చేయాలి



ప్రతి గ్రామంలో కమ్యూనిటీ హాల్ నిర్మిస్తున్నట్లుగా రైతులకు ఆహార ఉత్పత్తులు భద్రపరుచుకునేందుకు గోడౌన్లు ఏర్పాటు చేయాలి. కమ్యూనిటీ హాళ్లకు మాదిరిగానే రైతుల కోసం గోడౌన్లకు కూడా నిధులు మంజూరు చేయాలి. రైతుల సమస్యలపై శాశ్వత పరిష్కారం చూపాలి.

– కొలుసు గణపతిరావు, సొసైటీ మాజీ చైర్మన్

పాఠశాల తెరిచిన రోజే విద్యార్థులకు కిట్లు


గణపవరంలో స్టాక్ పాయింట్‌లో విద్యాకిట్లపై ఎంఈవోతో చర్చిస్తున్న రాష్ట్ర పరిశీలకుడు

గణపవరం: పాఠశాలలు తెరిచిన రోజునే విద్యార్థులందరికీ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యాకిట్లు తప్పనిసరిగా అందజేయాలని ఎస్ఆర్‌కెవిఎం–1 రాష్ట్ర పరిశీలకుడు డా. టిఎండి ఇస్మాయిల్ మండల అధికారులను ఆదేశించారు. సోమవారం గణపవరంలోని విద్యాకిట్ల స్టాక్ పాయింట్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన ఎంఈవో గొర్రెల బాలయ్య, ఎంఆర్‌సి సిబ్బందితో విద్యాకిట్ల పంపిణీపై సూచనలు ఇచ్చారు. పాఠశాలలు తెరిచే నాటికే అన్ని కిట్లు ఆయా పాఠశాలలకు చేర్చాలని బడులు తెరిచిన రోజునే విద్యార్థులకు వాటిని పంపిణీ చేయాలని అందుకు తగిన ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే జూనియర్ కాలేజిలకు సంబంధించిన విద్యార్థికిట్లు స్టాక్ పాయింట్‌లకు పంపడం జరిగిందన్నారు. పాఠశాలలకు సంబంధించిన కిట్లు వారం, పదిరోజుల్లో స్టాక్‌పాయింట్‌లకు అందజేయడం జరుగుతుందన్నారు. ఈయన వెంట సిఎంవో చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మన ఆరోగ్యం మన చేతుల్లోనే


గణపవరం: ఆరోగ్య అవగాహన సదస్సులో మాట్లాడుతున్న వైద్య నిపుణులు


దెందులూరు: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది


పెదవేగి: పీహెచ్‌సీ నుంచి ర్యాలీ ప్రారంభించిన వైద్య సిబ్బంది

గణపవరం: అనారోగ్యకరమైన ఆహారం, వేళాపాళాలేని ఆహార అలవాట్లు, తగిన శారీరక శ్రమ లేకపోవడం వంటి అలవాట్లతో మన ఆరోగ్యాన్ని మనమే పాడుచేసుకుంటున్నామని పలువురు వైద్య నిపుణులు తెలిపారు. ప్రపంచ ఆరోగ్యదినోత్సవం సందర్భంగా సోమవారం గణపవరం ఏరియా పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో లయన్స్‌క్లబ్ భవనంలో ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసదస్సుకు మండల పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.సత్యనారాయణమూర్తి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రముఖ లాప్రోస్కోపిక్ సర్జన్ మోహన కృష్ణ, ఎండి నాగరాజు వివిధ రోగాలకు కారణం, తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి వివరించారు. థైరాయిడ్ అపెండిక్స్, షుగర్, బిపి, గుండె సంబంధిత వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. పీఎంపీ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ గౌరవాధ్యక్షుడు నిడమర్తి జయసూర్య మాట్లాడుతూ కొన్ని ఆరోగ్య సమస్యలు జన్యుపరంగా వస్తే, మరికొన్ని సమస్యలను మనచేతులారా మనమే కొనితెచ్చుకుంటున్నామని అన్నారు. జంక్‌ఫుడ్స్, శారీరక శ్రమ లేకపోవడం, కొన్ని ఔషదాల వినియోగంవల్ల ఊబయాకం పెరిగిపోతుందని అన్నారు. చిన్నపిల్లల్లో ఎక్కువగా టీవీలు, స్మార్ట్‌ఫోన్‌కు అలవాటు పడటంవల్ల స్థూలకాయం వస్తుందన్నారు. జిల్లా పిఎంపి అసోసియేషన్ అధ్యక్షుడు ఏఆర్‌కే పరమేశ్వర్లు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ ఆరోగ్య నియమాలు పాటిస్తామని ప్రతిన బూనాలని పిలుపు ఇచ్చారు. ఈసదస్సులో రానున్న వేసవి వడగాడ్పులకు గురికాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పీఎంపీ అసోసియేషన్ నాయకులు జయరాం, నిమ్మల సుబ్బారావు, నిడమర్రు మండల పీఎంపీ అధ్యక్షుడు మూర్తి, ప్రధాన కార్యదర్శి సంకు శ్రీను, సభ్యులు అప్పారావు, జి.శ్రీను, గణేష్ పానకాలు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

దెందులూరు: ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆరోగ్య సమస్యలపై అవగాహన పెంపొందించుకుని శాశ్వత పరిష్కార దిశగా కృషి చేయాలని పోతునూరు పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్ కుమార్ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం పోతునూరు పీహెచ్‌సీ నుంచి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఉన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

పెదవేగి : ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం పెదవేగిలో సీహెచ్‌ఓ రోజ్‌మేరీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి డాక్టర్ మాధవి మాట్లాడుతూ జీవితంలో ఏమి ఉన్నా ఆరోగ్యం లేకపోతే అంతా శూన్యంగా మారుతుందని, ఆరోగ్యమే మహాభాగ్యమని అన్నారు. ఆరోగ్య సంరక్షణపై గ్రామంలోని ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతమైన జీవనం అలవరచుకోవాలని వైద్యులు సూచించారు. కార్యక్రమంలో అన్ని గ్రామాల వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ స్థాయిలో పార్టీని పటిష్టం చేయాలి


క్యాంపు కార్యాలయంలో పార్టీ ముఖ్యనాయకులతో సమావేశమైన వాసుబాబు

గణపవరం: వైఎస్సార్ సీపీ పట్ల ప్రజల్లో నమ్మకం మరింత పెరిగిందని, తాము అబద్ధపు హామీలను నమ్మి మోసపోయామని ప్రజలంతా గుర్తించారని ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఆయన నియోజకవర్గంలోని నాలుగు మండలాల పార్టీ ముఖ్యనేతలు, మండల ప్రజాప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈనెల 8వ తేదీ మంగళవారం ఉదయం పది గంటలకు ఏలూరులోని క్రాంతి కల్యాణ మండపంలో మాజీమంత్రి బొత్స సత్యనారాయణ నిర్వహించే సమావేశానికి నియోజకవర్గంలోని పార్టీ ముఖ్యనాయకులంతా హాజరుకావాలని ఆయన సూచించారు. ఈసందర్భంగా ఆయన పార్టీ నాయకులతో గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయడంపై చర్చించారు. పార్టీ నాయకులంతా ప్రజలకు అందుబాటులో ఉండి, వారి సమస్యలపై వెంటనే స్పందించాలని, అవసరమైన పక్షంలో వారి తరపున ప్రభుత్వంపై పోరాడాలని ఆయన సూచించారు. కూటమి నాయకులు ఇచ్చిని అలవికాని హామీలను నమ్మి మోసపోయినట్లు ప్రజలంతా గుర్తించారని అందుకు జగన్ ఎక్కడికి వచ్చినా ప్రజలు తండోపతండాలుగా తరలి రావడమే నిదర్శనమన్నారు. త్వరలో పార్టీ అధ్యక్షుడు వైఎస్‌జగన్ జిల్లాల పర్యటన చేపట్టి ప్రజల్లోనే ఉంటారని అన్నారు. ఈసందర్భంగా ఆక్వా రైతుల సమస్యలపై పలువురు నాయకులు వాసుబాబు దృష్టికి తీసుకువచ్చారు. వైఎస్సార్ సీపీ అధికారంలోఉన్నప్పుడు ఆక్వా మేతల ధరలు పెరిగినా, చేపలు, రొయ్యల ధరలు తగ్గినా దానికి ప్రభుత్వానికి ముడిపెట్టి దుష్ప్రచారం చేసేవారని, ఇప్పుడు కూటమి ప్రభుత్వ పాలనలో ఆక్వా రైతుల పరిస్థితి అధోగతి పాలైందని అన్నారు. చిన్న రైతులకు సైతం లక్షల్లో విద్యుత్ బిల్లులు వసూలు చేస్తున్నారని, వ్యాపారులు సిండికేట్‌గా మారి రొయ్యల ధర దారుణంగా తగ్గించినా ప్రభుత్వం చోద్యం చూస్తుందని దుయ్యబట్టారు. వైఎస్సార్ సీపీ పాలనలో రొయ్యలు, చేపలకు గిట్టుబాట ర గుర్తు చేశారు. ఆక్వా రైతుల చేసే ఆందోళనలకు వైఎస్సార్ సీపీ తరపున అండగా ఉండాలని నాయకులకు సూచించారు. ఈసందర్భంగా నాలుగు మండలాల నాయకులు, ప్రజాప్రతినిధులతో పార్టీని బలోపేతం చేయడంపై చర్చించారు. ఈసమావేశంలో ఎంపిపిలు అర్ధవరం రాము, ధనుకొండ ఆదిలక్ష్మి, గంటా శ్రీలక్ష్మి, కనుమాల రామయ్య, జెడ్పీటిసి సభ్యులు దేవారపు సోమలక్ష్మి, కోడే కాశీ, కె.జయలక్ష్మి, తుమ్మగుంట భవాని, పార్టీ కన్వీనర్‌లు దండు రాము, సంకు సత్యకుమార్, మరడ మంగారావు, రావిపాటి సత్తిబాబు, ముఖ్య నాయకులు వెజ్జు వెంకటేశ్వరరావు, ఎలిశెట్టి పాపారావు, పుప్పాల గోపి, పాత్తూరి శ్రీను, కందులపాటి శ్రీను, తుమ్మగుంటా రంగా, రామకుర్తి నాగేశ్వరరావు, ఇంజేటినీలిమ, పాము సనీతమాన్ సింగ్, పెనుగొండ బాలకృష్ణ పాల్గొన్నారు.

ఎండలతో ఉపాధి కూలీలు విలవిల


మండుటెండలో పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

- పని ప్రాంతాల్లో రక్షణ కరువు
- తీవ్ర ఆందోళనకు గురవుతున్న కూలీలు

దెందులూరు: మండుతున్న ఎండలతో ఉపాధి కూలీ లు విలవిల్లాడుతున్నారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా నియోజకవర్గంలో ఉపాధి పనులు నిర్వహిస్తున్నారు. మంచినీటి చెరువుల తవ్వకాలు ప్రారంభించారు. అయితే, ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో అందుకు అనుగుణంగా కూలీలకు రక్షణ ఏర్పాట్లు చేయడంలో అధికారులు విఫలమయ్యారు. దీనికి తోడు ప్రభుత్వం కొత్త నిబంధనలు తీసుకురావడంతో కూలీలకు దిక్కుతోచని పరిస్థితి ఎదురౌతోంది. రెండుపూటలా ఫొటో లు తీసి మస్తరు నమోదు చేయాలంటూ మెలిక పెట్టడంతో అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. పెరిగిన ఎండలతో ఫొటో విధానాన్ని మార్చాలని కూలీ లు డిమాండ్ చేస్తున్నా స్థానిక సిబ్బంది తామేమీ చేయలేమంటూ చేతులెత్తేస్తున్నారు. నియోజక వర్గం మొత్తం ఇదే పరిస్థితి నెలకొంది. వేసవిలో రక్షణ చర్యలు చేపట్టకపోవడం వల్ల ఇబ్బందులు పడాల్సి వస్తుందని కూలీలు వాపోతున్నారు. పని ప్రాంతంలో నీడ కోసం టెంట్ వేయించాలని, తాగునీరు, మజ్జిగ ఏర్పాటు చేయాలని, ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉంచాలని రెండు పూటలా ఫొటో విధానాన్ని రద్దు చేసి, ఉదయం 10.30 గంటలకే పని పూర్తి చేసే విధంగా నిబంధనలు సడలించాలని కోరుతున్నారు.

కనీస సౌకర్యాలు కల్పించాలి



వారం రోజులుగా ఎండలు మండిపోతుండడంతో పనులు చేయడానికి ఉపాధి కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పని ప్రదేశాల్లో టెంట్ వేయడం, చల్లటి నీరు, మజ్జిగ వంటి కనీసం సౌకర్యాలు అందించి కూలీల రక్షణకు చర్యలు తీసుకోవాలి.

– కట్టా ఏసుబాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి

తాగునీటి చెరువులో చేపల పెంపకంపై ఫిర్యాదు


భీమడోలు రామన్న చెరువులో పూడిక తీస్తున్న జేసీబీ

భీమడోలు: తాగునీటి చెరువును చేపల చెరువుగా మార్చేందుకు జరుగుతున్న పనులను నిలుపుదల చేయాలని కోరుతూ సోమవారం ఏలూరులోని కలెక్టరేట్ వద్ద ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో కొందరు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని ఆర్ఎస్ నెం.78లో రామన్న చెరువును మంచి నీటి అవసరాలకు మాత్రమే వినియోగించుకోవాల్సి ఉండగా కొందరు వ్యక్తులు దౌర్జన్యంగా ఆ చెరువులో చేపల పెంపకం కోసం చర్యలు చేపట్టారన్నారు. దీంతో పర్యావరణానికి హాని వాటిల్లుతుందని, అలాగే చుట్టూ ఆలయాలు ఉండడంతో భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురివుతారన్నారు. ఈ పనులు నిలుపుదల చేయాలని గ్రామ పంచాయతీ ఈవో, మండల ఈవోఆర్‌డీ, తహసీల్దార్, మత్స్యశాఖ అధికారులకు మొరపెట్టుకున్నా చర్యలు తీసుకోవడం లేదన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామస్తులు ఏఎస్ భూషణం, డి.వంశీధర్, ఎస్.రామ్‌చరణ్, టి.కార్తీక్ ఈశ్వర్‌లతో పాటు 39 మంది సంతకాలతో కూడిన ఫిర్యాదును జిల్లా కలెక్టర్‌కు అందించారు.

చెట్ల తొలగింపుపై కలెక్టర్‌కు ఫిర్యాదు

పూళ్ల, ఎంఎంపురం వెళ్లే మార్గంలో కరెంట్ స్తంభాలు వేసేందుకు పచ్చని చెట్లు తొలగించేలా గ్రామ పంచాయతీ చర్యలు చేపట్టడంపై పూళ్ల పంచాయతీ 12వ వార్డు సభ్యుడు ఓగిరాల సూర్యచంద్రరావు ఏలూరు కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. చెట్లు తొలగించకుండా ప్రభుత్వ స్థలంలో కరెంట్ స్తంభాలు వేయాలన్నారు. గతంలో పంచాయతీలో జరిగిన అవకతవకలపై జిల్లా అధికారులు ఫిర్యాదు చేసిన కారణంగా డ్రెయిన్లు, తూరలు, కంకర రోడ్లు వేయడం లేదన్నారు. తన పరిధిలో 150 మీటర్ల డ్రెయిన్ల నిర్మాణానికి, ఎస్సీ ఏరియాలో కమ్యూనిటీహాల్ నిర్మాణానికి నిధులు కేటాయించాలని వార్డు సభ్యులు కలెక్టర్‌ను కోరారు.

చెరువులను నీటితో నింపండి

గుండుగొలనులోని మంచినీటి, పశువుల చెరువులను వెంటనే నీటితో నింపేలా చర్యలు తీసుకోవాలని భీమడోలు మాజీ ఏఎంసీ చైర్మన్ వగ్వాల భాస్కర్ సోమవారం డీపీవో, ఎంపీడీవోలను కోరారు.

విశ్వాసులు మంచి ఆలోచనలతో మెలగాలి


భీమడోలు ఆర్‌సీఎం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న విశ్వాసులు

భీమడోలు: క్రైస్తవ విశ్వాసులు మంచి ఆలోచనలతో మెలగాలని కెర్యూలు సేవా కేంద్రం డైరెక్టర్ ఫాదర్ అజిష్ అన్నారు. భీమడోలు ఆర్‌సీఎం చర్చి ప్రాంగణంలో 38వ సజీవధారల సువార్త కూడికలు రెండో రోజైన గురువారం ఘనంగా జరిగాయి. భీమడోలు విచారణ కర్త షింటో థామస్ ఆధ్వర్యంలో విచారణ పరిధిలోని క్రైస్తవ విశ్వాసులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తొలుత ఫాదర్ అజిష్ దైవ సందేశాన్ని అందజేశారు. తపస్సు కాలంలో ఉన్న మనమందరం మంచి ఆలోచనలను కలిగి ఉండాలని, కేవలం 40 రోజులకే పరిమితం కాకుండా సంవత్సరం అంతా మన హృదయం పవిత్రంగా ఉండాలని కోరారు. అనంతరం మరియ మాత విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు. విచారణకర్త ఫాదర్ షింటో థామస్, డీపాల్ ప్రిన్సిపల్ ఫాదర్ నెల్సన్ జాన్, పంగిడిగూడెం విచారణ కర్త టోని, బీడీఎస్ డైరెక్టర్ ఫాదర్ జింటో, ఫాదర్లు జిజో, జోసఫ్, కన్యస్త్రీలు, పెద్దలు, డీపాల్ విన్సెంట్ సొసైటీ సభ్యులు, జీసస్ యూత్, మరియదళ సభ్యులు, అధిక సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు.

ధాన్యం రాశులను పరిశీలించిన ఏలూరు ఆర్‌డీఓ


ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డీఓ

దెందులూరు: ఉపరితలఆవర్తనం కారణంగా వాతావరణశాఖ హెచ్చరికల మేరకు కొవ్వలి గ్రామంలో ధాన్యం రాశులను సోమవారం రాత్రి ఆర్డీవో అంబరీష్, తహసీల్దార్ బి.సుమతి, ఏఓ దామా వెంకటేశ్వర్లు. పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్‌డీఓ రైతులకు పలు సూచనలుచేశారు. అలాగే పోతునూరు, కొవ్వలి, సీతంపేట, దెందులూరు గ్రామాల్లో తహసీల్దార్ బి.సుమతి, వ్యవసాయ అధికారి దామా వెంకటేశ్వర్లు పర్యటించి హైవేపై ధాన్యాన్ని పరిశీలించారు. కోఆపరేటివ్ సొసైటీ కార్యాలయాలకు ఫోన్ చేసి టార్పాలిన్లను రప్పించి రైతులకు అందించారు. తుపాను హెచ్చరికలు, సోమవారం మధ్యాహ్నం నుంచి మబ్బులు వేయటంతో రైతులు ఆందోళన పడుతున్న నేపథ్యంలో అధికారులు స్పందించి రోడ్లపై ఉన్న ధాన్యం తడవకుండా చర్యలు తీసుకున్నారు.

పాఠశాల అభివృద్ధికి దాతల సేవలు మరువలేనివి


డైనింగ్ హాల్‌ను ప్రారంభిస్తున్న ఉపవిద్యాశాఖాధికారి రవీంద్రభారతి

ఉంగుటూరు: పాఠశాల అభివృద్ధికి దాతలు అందజేస్తున్న సేవలు మరువలేనివని ఉపవిద్యాశాఖాధికారి రవీంద్ర భారతి పేర్కొన్నారు. సోమవారం నారాయణపురం జిల్లాపరిషత్ హైస్కూల్‌లో ఎన్ఆర్ఐ వల్లపూడి శ్రీధర్ ఆర్థికత్వంతో నిర్మించిన డైనింగ్ హల్‌ను రవీంద్రభారతి ప్రారంభించారు. ఈసందర్భంగా రవీంద్రభారతి మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి దాతలు చేస్తున్న సేవలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా శ్రీధర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఎన్ఆర్ఐ వల్లపూడి శ్రీధర్ మాట్లాడుతూ డైనింగ్ హల్ నిర్మించడం తనకెంతో తృప్తిగా ఉందన్నారు.ప్రతీ విద్యార్థి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దిద్ల అలకానంద తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేలపై దాడి

దెందులూరు: గంగన్నగూడెం గ్రామంలో నిర్వహిస్తున్న కోడిపందేలపై దాడులు చేసినట్లు ఎస్సై ఆర్ శివాజీ తెలిపారు. ఈ దాడుల్లో ఏడుగురిని అరెస్ట్ చేసి, నిందితుల నుంచి రూ.4,360 నగదు, రెండు కోళ్ల స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.